క్లుప్తంగా

ఆరోగ్య ఫలం.. సీతాఫలం



తోపుడుబండ్లపై విక్రయిస్తున్న సీతాఫలం

ఆదోనిటౌన్: శీతాకాలం అంటే మనకు వెంటనే గుర్తుకొచ్చే పండు సీతాఫలం. ఇవి తినడానికి ఎంత రుచిగా ఉంటాయో ఆరోగ్యానికి కూడా అంత మంచి చేస్తుంది. పట్టణంలో సోలాపూర్ సీతాఫలాల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఒక్కో పండు అరకిలోకు పైగానే ఉంటోంది. పోషక విలువలు అధికంగా ఉండడంతో వీటిని కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. కేజీ రూ.100 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నారు. సాధారణ సీతాఫలంతో పోల్చుకుంటే ఇవి చూడడానికి బాగా పెద్దగా కనిపిస్తుండడంతో ప్రజలు ఆకర్షితులవుతున్నారు. దీంతో సోలాపూర్ శీతాఫలం పండ్లకు మంచి గిరాకీ ఉంటోంది.

ఉపాధ్యాయుడి మృతి



మహేష్ (ఫైల్)

నందవరం: మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు హీరమఠం మహేష్ (56) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. నాలుగు రోజుల క్రితం వాంతులు, విరేచనాలతో అనారోగ్యానికి గురై ఎమ్మిగనూరు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కోలుకోలేక ఆదివారం వేకువజామున మృతి చెందాడు. ఆయన మంత్రాలయం మండలం బూదూరు గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయన భౌతిక కాయానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, సర్పంచ్ తోట సావిత్రి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కోసిగి: రంగప్పగట్టులోని పెండేకల్లు ఆంజనేయస్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున నుంచి ఆలయ అర్చకుడు అనంతసేనా స్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, ఆకుపూజ, ఫలపుష్పాలు, మహా మంగళహారతులు, నైవేద్యం సమర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్‌రెడ్డి ఆలయ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తరఫున రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ పెద్దలు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, నాడుగేని నాగరాజు, రాముడు, చింతకుంట ఈరన్న, ఆలయ కమిటీ పెద్దలు పి.శివన్న, వెంకటేష్, మూకయ్య పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నేత శ్రీరాములుగౌడ్

ఆదోనిరూరల్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరాములుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు సాంఘిక సంక్షేమ వసతి గృహాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏఐఎస్ఎఫ్ సభ్యులు విజయేంద్ర, థామస్, రంగస్వామి, మునిస్వామి, శ్రీరంగ, దస్తగిరి, శరత్‌కుమార్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల హౌస్ అరెస్ట్

ఆదోనిఅర్బన్: గౌనెగండ్లలో హిందువులకు సంబంధించిన స్థలాన్ని అన్యమతస్తులు ఆక్రమించుకుని అక్రమ కట్టడాన్ని నిర్మిస్తున్నారని, దాన్ని వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ చలో గౌనెగండ్లకు బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఆదోని నియోజకవర్గ కో–కన్వీనర్ నాగరాజుగౌడ్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, నాయకులు చెన్నబసప్ప, ఆంజనేయులు, పంపాపతిలను వెళ్లకుండా పోలీసులు ఆదివారం హౌస్ అరెస్టు చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

‘భవిత’ వెలుగులు

- శారీరక, మానసిక లోపాలున్న పిల్లలకు విద్యాబుద్ధులు
- చిన్నారుల మానసిక వికాసానికి కృషి
- ప్రత్యేక పరికరాలతో శిక్షణ
- ఆదోని మండలంలో 32 మంది పిల్లలు
- పరికరాలు అందిస్తున్న ప్రభుత్వం

శారీరక, మానసిక లోపాలతో బాధపడుతున్న పిల్లల జీవితాల్లో భవిత కేంద్రాలు వెలుగులు నింపుతున్నాయి. ఫిజియోథెరపీ, వ్యాయామం, ప్రత్యేక పరికరాలతో వారిని సాధారణ స్థితిలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాయి. ఆదోని మండలం భవిత కేంద్రంలో 32 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఉన్నారు. ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు పిల్లల మానసిక పరిస్థితిని గుర్తించి వారిలో మార్పును తీసుకొస్తున్నారు. ప్రభుత్వం చిన్నారులకు కావాల్సిన పరికరాలను అందజేస్తోంది.



తరగతి గదిలో శారీరక, మానసిక లోపం ఉన్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ఆదోని మండలం భవిత కేంద్రంలో 32 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఉన్నారు. మానసిక వైకల్యం, వినికిడి లోపం, ఆటిజం, దృష్టిలోపం, శారీరక వైకల్యం, సెరిబ్రల్ పాల్సి, బహుళ వైకల్యం వంటి 21 అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారికి విద్య బుద్ధులను నేర్పిస్తున్నారు. ప్రాథమిక విద్యను అందించడమే కాకుండా ఫిజియోథెరిపీ డాక్టర్ ద్వారా చికిత్స అందిస్తున్నారు. ప్రతి నెలా పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి మానసిక సంఘర్షణ కలిగిన పిల్లలతో ప్రవర్తించాల్సిన తీరుపై వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. భాష, భాషణంలో లోపం కలిగిన పిల్లలకు స్పీచ్‌థెరిపి వంటివి నేర్పిస్తున్నారు. అంగవైకల్యం కలిగిన పిల్లలకు ఫిజియోథెరిపి, సాధారణ స్థితికి రావడానికి ఎక్సర్‌సైజ్‌లను చేయిస్తున్నారు. బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలకు వారి అవసరాలను ఎలా గుర్తించాలి అనే అంశాలను పిల్లలకు తెలియజేస్తారు. మానసిక స్థితి నుంచి బయటపడిన పిల్లలను వారి వయస్సుకు తగ్గట్లు అయా పాఠశాలలో చేర్పిస్తారు.

ప్రభుత్వం అందిస్తున్న అలవెన్స్‌లు

- ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్: ప్రత్యేక శిక్షణ కోసం భవిత కేంద్రానికి వచ్చే పిల్లలకు నెలకు రూ. 300 చొప్పున 10 నెలలకు రూ.3000 అందిస్తుంది.
- ఎస్కార్ట్ అలవెన్స్: 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు పాఠశాలకు లేదా కళాశాలకు నడిచిరాలేని పిల్లలకు తల్లిదండ్రుల సహాయంతో బడికి వెళ్లడానికి నెలకు రూ.300 చొప్పున 10 నెలలు రూ.3000 అందిస్తుంది.
- ఇంటి వద్దే విద్య అలవెన్స్: బడికి రాలేని తీవ్ర వైకల్యం కలిగిన పిల్లలకు ఇంటికి వెళ్లి తర్ఫీదు ఇచ్చినందుకు నెలకు రూ.200 చొప్పున 10 నెలలకు రూ.2000 ఇస్తారు.
- స్టైఫండ్: 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విభిన్న ప్రతిభావంతుల బాలికలకు నెలకు రూ.200 చొప్పున 10 నెలలకు రూ.2000 అందిస్తారు.
- రీడర్ అలవెన్స్: దృషిలోపం కలిగిన పిల్లలకు పాఠ్యాంశాలను చదివి వినిపించేందుకు నెలకు రూ.300 చొప్పున 10 నెలలకు రూ.3000 అందిస్తారు.
- హాస్టల్ అలవెన్స్: 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు హాస్టల్‌లో చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన బాలికలకు నెలకు రూ.200 చొప్పున 10 నెలలకు రూ.2000 ఇస్తారు.



పరికరం సాయంతో నడుస్తున్న విద్యార్థి

సద్వినియోగం చేసుకోవాలి



మానసిక, శారీరక వైకల్యం కలిగిన పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. వివిధ రకాల సమస్యలతో పిల్లలు మా దగ్గరకు వస్తారు. వారికి ఆటలు, పాటలతో కూడిన విద్యను అందిస్తాం. శారీరక వైకల్యం కలిగిన పిల్లలకు ట్రై సైకిల్ వాకింగ్ నేర్పిస్తాం. చెవిటి, మూగ పిల్లలకు దృశ్యశ్రవణం ద్వారా విద్యను అందిస్తాం. పట్టణం, గ్రామీణ ప్రాంతాల నుంచి పిల్లలను భవిత కేంద్రానికి తీసుకుని రావడానికి ఎస్కార్ట్‌కు ప్రతి నెలా రూ.300 ఇస్తున్నాం. ఫిజియోథెరపీ వైద్యుడి ద్వారా మాసాజ్, వ్యాయామం వంటివి చేయించి పిల్లలను సాధారణ స్థితిలోకి వచ్చేందుకు కృషి చేస్తున్నాం.

–శాంతకుమార్ ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు

పిల్లలకు అవసరమైన పరికరాలు

శారీరక, మానసిక వైకల్యం కలిగిన పిల్లలకు ప్రభుత్వం అవసరమైన పరికరాలను ఉచితంగా అందిస్తుంది. ముఖ్యంగా వీల్‌చైర్స్, ట్రైసైకిల్, వినికిడి యంత్రాలు, సీపీచైర్స్ వంటివి అందిస్తారు. ఇటీవల ప్రభుత్వం వినికిడి లోపం, దృష్టిలోపం కలిగిన పిల్లలు ట్యాబ్ ద్వారా పాఠ్యాంశాలను విని నేర్చుకోవడానికి ట్యాబ్‌లను పంపిణీ చేసింది. పిల్లలకు ఆటలతో కూడిన విద్యబోధనతో పాటు నడక, మాట, వినికిడి, బుద్ధిమాంద్యం వంటి సమస్యలను తొలగించడానికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

విద్యారంగ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం విద్యారంగ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల ఆవరణలో ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..3,4,5 తరగతులను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, జిల్లా అధ్యక్షుడు రంగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రఘురామయ్య, నాయకులు నరసింహులు, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

హొళగుంద: జిల్లాలో దసరా ఉత్సవాలకు ప్రత్యేకత చాటుతున్న దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలిరాగా వారికి పూజారులు తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

ఆలూరు రూరల్: స్థానిక మారుతి నగర్‌లో ఓ ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. ఆలూరుకు చెందిన రవీంద్రరావు దంపతులు రెండు రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి బంధువుల ఊరికి వెళ్లారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం ఇంటి పనిమనిషి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడంతో వారి బంధువులు, చుట్టపక్కల వారికి విషయం తెలిపింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. బీరువా ధ్వంసం చేసినట్లు గుర్తించారు. ఇంటి యజమాని వచ్చి ఫిర్యాదు చేస్తే దొంగలు ఏమి ఎత్తుకెళ్లారో తెలుస్తుందని పోలీసులు తెలిపారు.



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

త్రోబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు త్రోబాల్ పోటీల్లో ప్రతిభ చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ నాయుడు తెలిపారు. ఆదివారం పాఠశాల ఆవరణలో త్రోబాల్ క్రీడా పోటీలు జరిగాయి. మండల విద్యాధికారి బి. శివరాములు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. త్రోబాల్ పోటీల్లో 8 గ్రూపులు పాల్గొన్నాయని చెప్పారు. నేషనల్ పాఠశాల మొదటి బహుమతి గెలుచుకోగా రెండో బహుమతి ఆర్ఆర్ లెబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుచుకున్నారని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీలను నిర్వహించడానికి సహకరించిన వ్యాయమ ఉపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు మధుసుదన్ రావు, అబిదబేగం, ఇందిర ప్రియాంక, రాజ్యలక్ష్మి, నాగేష్, వీరచంద్రయాదవ్, శ్రీరాములను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నకుల రాజు, వైస్ చైర్మన్ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి




పంపాపతి (ఫైల్)

ఆదోనిరూరల్: ఆదోని మండలం గణేకల్ గ్రామానికి చెందిన వీఆర్‌ఏ పంపాపతి(60) ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో ఇంట్లో ఉంటున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి మట్టి ఖర్చులకు రూ.15 వేలు అందజేశారు. పంపాపతి విధి నిర్వహణలో నిజాయితీగా పనిచేసేవాడన్నారు. ఆయన మృతి బాధాకరమని తెలిపారు.

చర్చీలు.. చరిత్రకు సాక్ష్యాలు

- 191 ఏళ్ల క్రితం స్థాపించిన రామదుర్గం చర్చి
- చరిత్ర పుటలకెక్కిన ఎం.కొట్టాల చర్చి
- పశ్చిమ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన పురాతన కట్టడాలు



రామదుర్గంలో నిర్మించిన మోక్షారోహిణి ప్రార్థనా మందిరం

ఆలూరు రూరల్: క్రైస్తవుల ఆరాధన కేంద్రాలైన చర్చీలకు ఆలూరు నియోజకవర్గంలో ఎనలేని చరిత్ర ఉంది. ముఖ్యంగా బ్రిటీషు కాలంలో నిర్మించిన చర్చీలు నేటికీ చెక్కుచెదరకుండా ఠీవీగా దర్శనమిస్తున్నాయి. 1830 సంవత్సరంలో చిప్పగిరి మండలంలోని రామదుర్గం గ్రామంలో నిర్మించిన చర్చి చరిత్రకు గుర్తుగా నిలిచింది. 193 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కట్టడం ఇప్పటికీ చెక్కుచెదరకుండా అలాగే ఉంది. బ్రిటీషు కాలంలో ఫాదర్ వెర్మోలిన్ ఈ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బ్రిటీషు హయాంలో చెన్నై, ముంబై, బెంగళూరు నగరాల నుంచి పాలన సాగించిన అధికారులు ఈ చర్చి ఆవరణలో బస చేసి ఇక్కడి నుంచి పరిపాలన నడిపేవారని చరిత్ర చెబుతోంది. పశ్చిమ భారత దేశంలో జిల్లాలోని చిప్పగిరి మండలంలో 19 దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ క్రైస్తవ మందిరం ఘన చరిత్ర కలిగి ఉండడం విశేషం.

92 ఏళ్ల చరిత్ర కలిగిన ఎం.కొట్టాల ఆర్సీఎం చర్చి

ఆలూరు మండలంలోని ఎం.కొట్టాల గ్రామంలోని సీఎస్ఐ (చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా) నిర్మించి 91 ఏళ్లు పూర్తయ్యింది. ఈ గ్రామంలో 2,090 ఎకరాల బంజరు భూమిని అప్పటి బ్రిటీషు అధికారులు పేదలకు పంచిపెట్టారు. భూమిని సాగు చేసుకునేందుకు వారు అక్కడే ఇళ్లను నిర్మించుకొని జీవనం ప్రారంభించారు. ఇంటి నిర్మాణాలతో పాటు సీఎస్ఐ చర్చిని నిర్మించుకున్నారు. కొట్టాల గ్రామంలో 230 కుటుంబాలు ఉండగా ఇందులో 205 కుటుంబాలు క్రైస్తవ మతస్తులు కావడం విశేషం. ఇప్పటికీ లండన్ నుంచి ఈ ప్రార్థనాలయానికి నిధులు వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

గ్రామాల్లో అభివృద్ధి పరుగులు

- ఉప్పరహాల్‌లో రూ.కోటితో సీసీ రోడ్లు
- రూ.1.32 కోట్లతో పాఠశాల భవన నిర్మాణం
- రూ.43 లక్షలతో సచివాలయం
- నేలకోసిగి గ్రామంలో రూ.13.50 లక్షలతో ఇంటింటికీ కొళాయిల ఏర్పాటు
- గడప గడపకు నిధులతో అభివృద్ధి పనులు



జెడ్పీ పాఠశాల భవనం



ఇంటి ముందున్న కొళాయిల్లో నీటిని పట్టుకుంటున్న మహిళలు



గడప గడప నిధులతో ఏర్పాటు చేసిన సిమెంటు రోడ్డు



ఉపయోగంలోకి తీసుకొచ్చిన ఓవర్ హెడ్ ట్యాంక్

కౌతాళం/కోసిగి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామస్వరాజ్యం దిశగా గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధి ఆమడ దూరంలో ఉన్న పల్లెలు నేడు సీసీ రోడ్లు, సచివాలయాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఆర్బీకేలతో కళకళలాడుతున్నాయి. అలాంటి గ్రామమే మండల పరిధిలోని ఉప్పరహాల్. గ్రామంలో సుమారు రూ. 3 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. గ్రామంలో ప్రధానంగా తాగునీరు, రోడ్డు, పాఠశాల భవన సమస్య ఉండేది. ఈ పనులన్నీ పంచాయతీ నిధులు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు, మండల్ ఫండ్స్, ఎంపీ ఫండ్స్‌తో పూర్తి చేశారు. రూ. 43 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 5 సిమెంటు రోడ్లు పూర్తి చేశారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కావడంతో పాఠశాలకు 6 అదనపు గదుల కోసం ప్రభుత్వం రూ. 1.32 కోట్ల నిధులను మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ గదుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీనిని జనవరిలో ప్రారంభిరచనున్నారు. అలాగే రూ.16 లక్షల గడప గడపకు నిధులతో రెండు సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేశారు. మరో రూ. 16 లక్షల ఎంపీ ఫండ్స్‌తో బస్టాండ్ ప్రాంతంలో సిమెంట్ రోడ్డు వేశారు. మండల్ ఫండ్స్ రూ. 20 లక్షలతో వీధుల్లో రోడ్లు వేశారు. అలాగే రూ. 43 లక్షలతో సచివాలయం నిర్మించారు. వచ్చే నెల ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేలకోసిగిలో నీటి కష్టాలకు చెక్

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నేలకోసిగి గ్రామం పంచాయతీగా ఏర్పడింది. పంచాయతీ ఎన్నికల్లో ఆ గ్రామ ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ మద్దతురాలు పశువుల హనుమంతమ్మను ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. 20 ఏళ్లుగా గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు నానా అవస్థలు పడుతుండేవారు. ప్రతి రోజు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకునేవారు. గ్రామంలో 192 కుటుంబాలు ఉన్నాయి. జలజీవన్ మిషన్ కింద రూ.13.50 లక్షలతో ఇంటింటా కొళాయిలు ఏర్పాటు చేశారు. దుద్ది రిజర్వాయర్ వద్ద ఒక బోరు, కోసిగిలో ఓ బోరు వేయించి గ్రామానికి కొత్తగా పైప్ లైన్ వేసి తాగునీటిని సరఫరా చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఉపయోగంలోకి తీసుకొచ్చారు. పైప్‌లైన్ ద్వారా ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీటిని సరఫరా చేసి గ్రామంలో రోజూ ఉదయం, సాయంత్రం ఇంటింటికి తాగునీటిని వదులుతున్నారు. దీంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లు బాగుపడ్డాయి



రావిహాలు రస్తాలోని మా కాలనీలో సిమెంటు రోడ్డు వేయడంతో బురద కష్టాలు తీరాయి. వర్షం వచ్చినప్పుడల్లా రోడ్డంతా బురదమయంగా మారేది. అలాగే నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. గ్రామం ఎప్పుడు బాగు పడుతుందిరా అనుకునేవాడిని. అయితే జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక గ్రామ రూపురేఖలు మారిపోయాయి. రోడ్డుతో పాటు గ్రామంలో అభివృద్ధి పనులు చేశారు.

–రమేష్, ఉప్పరహాల్

ఇంటింటికీ కొళాయిలు



తాగునీటి కోసం వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు వెళ్లేవాళ్లం. నీటి కోసం గంటల తరబడి ఎదురుచేసేవాళ్లం. ఇప్పుడు గ్రామంలోని ప్రతి ఇంటికి కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నారు. గ్రామంలోని అనేక సమస్యలు పరిష్కారమయ్యాయి. చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి ప్రభుత్వం ఉంటే పల్లెలు బాగుపడతాయి.

–రాగమ్మ, ఉప్పరహాల్

నీటి కష్టాలు తప్పాయి



గ్రామంలో తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతూ బోర్లు, బావుల వెంబడి తిరుగుతుండేవాళ్లం. పగటి వేళల్లో కరెంటు సౌకర్యం ఉంటే పనులు మానుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా ఇంటి వద్దే కొళాయిలు ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిని వదులుతున్నాయి. నీటి కష్టాలు తీరాయి.

–గోవిందప్ప, నేలకోసిగి

ప్రభుత్వ మేలు మరువలేనిది



మా గ్రామం వందగల్లు గ్రామానికి మజరా గ్రామంగా ఉండేది. గతంలో గ్రామాన్ని అధికారులు, పాలకులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మా గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేశారు. మా గ్రామ ప్రజలు నన్ను ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. సర్పంచ్ అయ్యాక ప్రభుత్వం, ఎమ్మెల్యే సహకారంతో ఇంటింటా కొళాయిలు ఏర్పాటు చేశాం. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ రుణం తీర్చుకోలేనిది.

–పశువుల హనుమంతమ్మ, సర్పంచ్ నేలకోసిగి

29న ఏరిగేరిలో గడప గడపకు..

కౌతాళం: మండల పరిధిలోని ఏరిగేరి గ్రామంలో ఈ నెల 29న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గ్రామంలో పర్యటిస్తారన్నారు. స్థానికులు ఏవైనా సమస్యలు ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. అలాగే నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తారని తెలిపారు.